క్లుప్తంగా

కల నెరవేరిన వేళ

బట్లచందారం గ్రామానికి బీటీ రోడ్డు పూర్తి



పూర్తయిన బీటీ రోడ్డు పనులు

దోమ: దోమ మండలం బట్లచందారం గ్రామానికి ఏళ్ల తరబడి బీటీ రోడ్డు లేక గ్రామస్తులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వర్షాలకు రోడ్డు చిత్తడిగా మారడంతో గుంతలుగా తయారై కంకర తేలి ప్రజలు అనేక కష్టాలు ఎదుర్కొన్నారు. ఎట్టకేలకు ప్రభుత్వం బీటీ రోడ్డు మంజూరు చేసింది. రూ. 1.25లక్షలతో 2.5 కిలోమీటర్ల మేర అధికారులు రోడ్డును పూర్తి చేశారు. దీంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు. తమ గ్రామానికి బీటీ రోడ్డు వేసినందుకు రాష్ట్ర ప్రభుత్వానికి, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

వాటర్ ప్లాంట్ ప్రారంభం



వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న సంఘం సభ్యులు

కొడంగల్ రూరల్: పట్టణంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం హస్నాబాద్ హెడ్ క్వార్టర్‌లో బుధవారం నూతన వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. సంఘం అధ్యక్షుడు కటుకం శివకుమార్‌గుప్తా, సంఘం కార్యవర్గ సభ్యులు కొల్లురు నారాయణ, ముదెల్లి రాఘవేందర్‌రెడ్డి, గతుప బుగ్గప్ప, బంటు ఫకిరప్ప, గొల్ల ఎల్లమ్మ, మాల సాయమ్మ, ఎండీసీసీబీ బ్యాంక్ మేనేజర్ ప్రభాకర్, సూపర్‌వైజర్ విష్ణువర్ధన్‌లు ప్రత్యేక పూజలు నిర్వహించి వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు.

ఆర్థిక సాయం

కుల్కచర్ల: పేద ప్రజలకు కాంగ్రెస్ అండగా ఉంటుందని డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి పేర్కొన్నారు. బుధవారం కుల్కచర్ల మండల కేంద్రానికి చెందిన కర్రె నర్సింలు అనారోగ్య సమస్యతో చికిత్సపొందుతూ మృతి చెందారు. విషయం తెలుసుకున్న డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి స్థానిక నాయకులతో కలిసి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ బ్లాక్ బి అధ్యక్షుడు భరత్ కుమార్, ఎల్లయ్య, నర్సింలు, రామయ్య, వెంకటయ్య, ఆంజనేయులు, శ్రీను, సురేష్, డి.శ్రీనివాస్, రమేష్, భాను, మురళీ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఆధ్వర్యంలో...

కుల్కచర్ల గ్రామానికి చెందిన కర్రె నర్సింలు మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే మహేశ్ రెడ్డి స్థానిక నాయకులు సొసైటీ డైరెక్టర్ నర్సింలు, మాజీ ఎంపీటీసీ కృష్ణయ్య, జె.వెంకటయ్య, బిచ్చయ్య తదితరులు బాధిత కుటుంబీకులకు రూ. 5వేలు సాయం అందజేశారు.

కొనసాగుతున్న పునఃప్రతిష్ఠ మహోత్సవం

యాలాల: మండల కేంద్రంలోని ఆంజనేయ స్వామి ఆలయ ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠ మహోత్సవాలు రెండో రోజు కొనసాగాయి. బుధవారం ఉదయం 5 గంటలకు సుప్రభాత సేవ, 8 గంటలకు శాంతి పారం, గోమాత పూజ, ఆవాహితదేవతా పూజ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఈ పూజలో యాలాల జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సిద్రాల శ్రీనివాస్, మాజీ సర్పంచ్ సులోచన దంపతులు హాజరయ్యారు. చివరి రోజు గురువారం ధ్వజ స్తంభతో పాటు, బొడ్రాయి ప్రతిష్ఠాపన ఉంటుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

మూడు గంటలు.. మూగ యాతన

ఫైబర్ నెట్‌వర్క్ కాల్వలో ఇరుక్కుపోయిన గోవు

అతికష్టం మీద బయటకు లాగిన వాహనదారులు

బషీరాబాద్: ఫైబర్ నెట్‌వర్క్ కోసం తీసిన కాల్వలో ఇరుక్కుపోయిన ఓ ఆవు మూడు గంటల పాటు ఇబ్బంది పడింది. ఈ ఘటన బషీరాబాద్ మార్గంలోని గోనూరు గేటు సమీపంలో బుధవారం సాయంత్రం జరిగింది. గ్రామానికి చెందిన మాల మాణిక్యప్ప తన పొలం నుంచి పశువులను తీసుకొని ఇంటికి వెళ్తుండగా.. ఫైబర్ నెట్‌వర్క్ కోసం తీసి, వదిలేసిన కాల్వలో ఇరుక్కుపోయింది. అయితే కాల్వలో పడిపోయిన ఆవుకు మరో ఆవుతో లెంక పెట్టి ఉండటంతో కాల్వలో పడిన గోవు మెడకు తాడు బిగుసుకుని, ఊపిరాడలేదు. బాధిత రైతు బోరున విలపిస్తూ ఎంత ప్రయత్నించినా ఆవును బయటకు తీయలేకపోయాడు. రోడ్డుపై వెళ్తున్న వాహనదారులను బతిమాలి, అతికష్టం మీద ఆవును బయటకు లాగారు. రోడ్డుపక్కన తవ్విన కాల్వలను పూడ్చకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నర్సరీ నిర్వహణలో నిర్లక్ష్యం తగదు

- ఎంపీడీఓ మహేశ్‌బాబు
- ఊట్‌పల్లి పాఠశాల తనిఖీ



ఊట్‌పల్లి పాఠశాల పరిసరాలను పరిశీలిస్తున్న మహేశ్‌బాబు

దోమ: ఉపాధిహామీ పథకం కింద గ్రామాల్లో ఏర్పాటు చేసిన నర్సరీ నిర్వహణలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఎంపీడీఓ మహేశ్‌బాబు హెచ్చరించారు. బుధవారం దోమ మండల పరిధిలోని ఊట్‌పల్లి నర్సరీని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మొత్తం మండల వ్యాప్తంగా 36 గ్రామ పంచాయతీలు ఉన్నప్పటికి ప్రతి గ్రామ పంచాయతీకి ఓ నర్సరీని ఏర్పాటు చేస్తున్నామన్నారు. నర్సరీలలో వివిధ రకాల మొక్కలను పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. వచ్చే హరితహారానికి ప్రతి నర్సరీలో కానుగ, టేకు, జామ, ఉసిరి, నిమ్మ, చింత, నిలగిరితో పాటు తదితర మొక్కలను అందుబాటులో ఉంచుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, టీఏ, ఫీల్డ్ అసిస్టెంట్, ఉపాధిహామీ కూలీలు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్య బోధించాలి..

ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్యా బోధన చేయాలని, ఈ విషయంలో ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎంపీడీఓ మహేశ్‌బాబు సూచించారు. బుధవారం దోమ మండల పరిధిలోని ఊట్‌పల్లి గ్రామంలో పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి విద్యార్థులతో మాట్లాడారు. పాఠశాలలో ఏదైనా సమస్యలు ఉన్నాయా? లేవా? అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ప్రతివిద్యార్థి బాగా చదువుకొని ఉన్నతస్థాయిలో స్థిరపడాలని సూచించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆయన సందర్శించి విద్యార్థులతో ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మొగులయ్య, ఉపాధ్యాయులు, అంగన్వాడీ టీచర్, తదితరులు పాల్గొన్నారు.



నర్సరీని పరిశీలిస్తున్న మహేశ్‌బాబు

విద్యార్థులకు రక్తహీనత పరీక్షలు

ఎంఈఓ వెంకట్, డాక్టర్ సురేశ్



బొంపల్లి పాఠశాలలో హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ సురేశ్

దోమ: విద్యార్థులు రక్తహీనత (ఎనీమియా) పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలని ఎంఈఓ వెంకట్, డాక్టర్ సురేశ్ పేర్కొన్నారు. బుధవారం బొంపల్లి పాఠశాలలో ఎనీమియా ముక్తా భారత్‌లో భాగంగా 6, 7వ తరగతి విద్యార్థులకు హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రక్త హీనత లోపించిన విద్యార్థులకు ఉచితంగా మందులు అందజేశారు.

విద్యార్థుల్లో రక్త హీనత కలగకుండా ఉండేందుకు ఆకుకూరలు, బీట్‌రూట్ వంటివి తీసుకోవాలన్నారు. ముఖ్యంగా హిమోగ్లోబిన్ అనేది స్త్రీలలో 12 నుంచి 14 గ్రామ్స్, పురుషులలో 14 నుంచి 16 గ్రామ్స్ వరకూ ఉండాలన్నారు. హిమోగ్లోబిన్ శాతం తగ్గితే విద్యార్థుల్లో ఏకాగ్రత లోపిస్తుందని తెలిపారు. ప్రతి విద్యార్థి రక్త పరీక్షలు చేయించుకొని హిమోగ్లోబిన్ శాతం తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు షఫీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నూతన వ్యవసాయాధికారిగా పరిమళ



పరిమళను సన్మానిస్తున్న మండలవాసులు, ఫర్టిలైజర్ వ్యాపారులు

కుల్కచర్ల: చౌడాపూర్ మండల నూతన వ్యవసాయాధికారిగా పరిమళ బాధ్యతలు స్వీకరించారు. కుల్కచర్ల మండల వ్యవసాయాధికారి వీరస్వామి ఆధ్వర్యంలోనే విధులు నిర్వహిస్తున్న క్రమంలో నూతన ఏఓగా ఎంపికై పరిమళకు మొదటి పోస్టింగ్ చౌడాపూర్ మండలానికి ఉన్నతాధికారులు కేటాయించారు. మండల పరిధిలోని ఫర్టిలైజర్ దుకాణదారులు తదితరులు ఆమెను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కుల్కచర్ల ఏఓ వీరస్వామి, చౌడాపూర్ ఏఈఓ విశ్వనాథ్, ఫర్టిలైజర్ దుకాణదారులు బి.వెంకటేష్, కళ్యాణ్, నర్సింలు, తదితరులు పాల్గొన్నారు.

బాలికలకు వ్యాసరచన పోటీలు



మాట్లాడుతున్న సాధన మండల కో ఆర్డినేటర్ అంజయ్య



తాండూరు టౌన్: ముగింపు ఉత్సవంలో ఉపాధ్యాయులు, విద్యార్థినులు, సంస్థ సభ్యులు

ధారూరు: అంతర్జాతీయ బాలల హక్కుల దినోత్సవం సందర్భంగా సాధన స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బుధవారం ధారూరు బాలికల ఉన్నత పాఠశాల, కస్తూరీబాగాంధీ బాలికల విద్యాలయంలో వ్యాస రచన పోటీలు నిర్వహించారు. అస్సెస్ టూ జస్టిస్ ప్రాజెక్టులో భాగంగా బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలు, బాల కార్మికులు, బాలల అక్రమ రవాణ గురించి వ్యాస రచన పోటీలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో విజేతలకు బహుమతు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సాధన మండల కో ఆర్డినేటర్ బి. అంజయ్య మాట్లాడారు. చిన్నతనంలో వివాహాలు చేసుకోవడం, చేయడం చట్టారీత్యా నేరమన్నారు. బాలికలకు యుక్త వయస్సు వచ్చాకే పెళ్లిళ్ల చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ స్రవంతి, బాలికల ఉన్నత పాఠశాల ఇంచార్జి హెచ్‌ఎం స్వప్న, ఉపాధ్యాయులు, సాధన సంస్థ సిబ్బంది ఆసీమా, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బాలల హక్కుల దినోత్సవం

తాండూరు టౌన్: అంతర్జాతీయ బాలల హక్కుల దినోత్సవం ముగింపు ఉత్సవాలను సాధన స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పాత తాండూరులోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు వ్యాసరచన, ఉపన్యాస పోటీలను నిర్వహించి బహుమతులను అందజేశారు. అనంతరం సంస్థ ప్రతినిధులు జ్యోతి, రాములు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శోభారాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

25న గిరి ప్రదక్షిణ

అనంతగిరి: ఈ నెల 25న అనంతగిరి గిరి ప్రదక్షిణ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతపద్మనాభ స్వామి ఆలయ కార్తీకమాస పెద్ద జాతర ఉత్సవాల ముగింపు సందర్భంగా సోమవారం ఈ ప్రదక్షిణ చేపట్టనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఉదయం 5.40గంటలకు రాజీవ్‌నగర్ కాలనీలోని భవానీమాత ఆలయం వద్ద ప్రారంభమై శుభం ఫంక్షన్ హాల్, గోధుమగూడ, కెరెల్లి, బుగ్గ రామలింగేశ్వర స్వామి ఆలయం వద్ద మధ్యాహ్నం భోజన ప్రసాదం ఉంటుందని పేర్కొన్నారు. అనంతరం అక్కడి నుంచి రిక్షా కాలనీ, బండ బావి మీదుగా అనంతగిరిగుట్ట ఆలయానికి సాయంత్రం చేరుకుంటుందని తెలిపారు. కావున ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

కొనసాగుతున్న జాతర

పెద్ద జాతర ఉత్సవాలు ఇంకా కొనసాగుతున్నాయి. భక్తులు స్వామి వారిని దర్శించుకుని మొక్కలు చెల్లించుకుంటున్నారు. అనంతరం ఆలయ పరిసరాల్లో కుటుంబసమేతంగా ఆహ్లాదంగా గడుపుతున్నారు. కాగా అనంతగిరి పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో చేపడుతున్న అఖండ భజన కార్యక్రమాలు కొనసాగుతున్నాయని నిర్వాహకులు తెలిపారు.

నేడు కోత్లాపూర్‌లో దర్గా

తాండూరు రూరల్: మండల పరిధిలోని కోత్లాపూర్ గ్రామంలోని మొహలాలీ దర్గా జాతర గురువారం నుంచి నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దర్గా జాతరకు చుట్టు పక్కల గ్రామాలతో పాటు కర్ణాటక నుంచి భక్తులు తరలివస్తారని పేర్కొన్నారు.

నేడు రైస్‌మిల్లు ప్రారంభం

ధారూరు: మండల కేంద్రంలోని డబుల్ బెడ్‌రూం ఇళ్ల పక్కనే నిర్మించిన రైస్‌మిల్లును ప్రారంభించనున్నారు. ధారూరు పీఏసీఎస్ సంఘం ద్వారా నిర్మించిన నూతన మిల్లు 1,500ల మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యం గల గోదాంను నాబార్డు వారి ఆర్థిక సహాయంతో రూ. 2.01 కోట్లతో నిర్మించారని నిర్వాహకులు తెలిపారు. దాన్ని రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ గురువారం మధ్యాహ్నం ప్రారంభించనున్నారని పేర్కొన్నారు.

యువత ఓటు నమోదు చేసుకోవాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ విజయ్‌కుమార్

కొడంగల్ రూరల్: 18ఏళ్ల నిండిన యువత ఓటు నమోదు చేసుకోవాలని అన్ని రాజకీయ పార్టీల నాయకులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తహసీల్దార్ విజయ్‌కుమార్ తెలిపారు. బుధవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ నెల 23, 24వ తేదీలలో క్షేత్రస్థాయిలో ఓటు నమోదు చేయించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. బీఎల్ఓలు, రెవెన్యూ సిబ్బంది, రాజకీయ పార్టీల నాయకులు సమన్వయంతో వ్యవహరించి ఓటు నమోదుకు కృషిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎలక్షన్ డీటీ అనిత, ఆర్ఐ రాఘవేందర్‌రావు, సీనియర్ అసిస్టెంట్ వీరేశం, జూనియర్ అసిస్టెంట్ రాజ్‌కుమార్, రాజకీయ పార్టీల నాయకులు మాజీ సర్పంచు రమేశ్‌బాబు, చంద్రప్ప తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక

మొయినాబాద్ రూరల్: తోల్‌కట్ట సమీపంలోని రాష్ట్ర సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థిని ఎస్.వైష్ణవి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ పి.మాలతి తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు, అధ్యాపకులు ఆమెను అభినందించారు. ఇటీవల 68వ రాష్ట్రస్థాయి క్రీడాపోటీలు ఖమ్మంలో నిర్వహించగా అండర్-14 విభాగం అథ్లెటిక్ పోటీల్లో జాతీయస్థాయికి ఎంపికైంది. ఝార్ఖండ్‌లో డిసెంబర్ మొదటి వారంలో నిర్వహించనున్న పోటీలో ఆడనున్నట్లు తెలిపారు.

సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం

- మున్సిపల్ ఫ్లోర్ లీడర్ సుధాకర్‌రెడ్డి
- లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ



దోమ: బొంపల్లిలో బాధితుడికి చెక్కు అందజేస్తున్న నేతలు

వికారాబాద్ అర్బన్: సీఎంఆర్ఎఫ్ పేదలకు వరమని మున్సిపల్ ఫ్లోర్ లీడర్ సుధాకర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు మంజూరైన చెక్కులను సుధాకర్‌రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్పొరేట్‌కు ధీటుగా పేదలకు వైద్యం అందాలని పేర్కొన్నారు. ఆపద సమయంలో పేదలకు సీఎంఆర్ఎఫ్ ఉపయోగపడుతుందన్నారు. అర్హులైన ప్రతిఒక్కరూ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

దోమలో..

దోమ: సీఎం సహాయనిధి పేదలకు ఉపయోగపడుతుందని కాంగ్రెస్ నేతలు పేర్కొన్నారు. బుధవారం దోమ మండల పరిధిలోని బొంపల్లి గ్రామంలో ముద్దం శ్రీనివాస్ గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న గ్రామ కాంగ్రెస్ నేతలు ఎమ్మెల్యే టి. రామ్మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆస్పత్రి ఖర్చుల నిమిత్తం సీఎం సహాయనిధి ద్వారా మంజూరైన చెక్కును కాంగ్రెస్ నేతలు బాధితుడి నివాసంలో అందజేశారు. అనంతరం వారు మాట్లాడారు. ప్రభుత్వం పేదలకు అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో నర్సింహారెడ్డి, బాల్‌రాజ్, మల్లారెడ్డి, రాములు, శేఖర్, ఇంతియాజ్, భాస్కర్, రమేశ్, బషీర్, యాదయ్య, హైమద్, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమం కోసం కుటుంబ సర్వే

జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ డైరెక్టర్ యాదయ్య, మాజీ ఎంపీటీసీ అనిత



సర్వేను పరిశీలిస్తున్న యాదయ్య, అనిత

దోమ: ప్రజా సంక్షేమం కోసమే సమగ్ర కుటుంబ సర్వేను రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తుందని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ డైరెక్టర్ బంగ్ల యాదయ్య, మాజీ ఎంపీటీసీ అనిత పేర్కొన్నారు. బుధవారం దోమ గ్రామంలో ఎన్యుమరేటర్లు నిర్వహిస్తున్న సర్వేను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.కోట్లు వెచ్చించి సర్వే నిర్వహించి వివరాలు వెల్లడించకపోవడం బాధాకరమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే సీఎం రేవంత్‌రెడ్డి సమగ్ర కుటుంబ సర్వేను పకడ్బందీగా నిర్వహిస్తున్నారన్నారు. దీంతో దామాషా ప్రాతిపదికన నిధులు కేటాయింపులకు, సంక్షేమ పథకాల అమలుకు అవకాశం ఉంటుందన్నారు.

కొనసాగుతున్న ఉర్సు ఉత్సవాలు



దట్టి కప్పుతున్న మత పెద్దలు, మోయిజ్‌ఖురేషి తదితరులు

ధారూరు: ధారూరు మండల కేంద్రంలో సయ్యద్ కోచక్‌షా ఖాద్రి మస్త్ హమ్ దమ్ జిందా షావలి దర్గా ఉర్సు ఉత్సవాలు కొనసాగుతున్నాయి. మంగళవారం రాత్రి దర్గా ఉత్సవ కమిటీ ఇంచార్జి బియాబాన్, ఆయన కుటుంబీకులు, ఎంఐఎం మండల అధ్యక్షుడు మోయిజ్‌ఖురేషి, ధారూరు జామీయా మసీద్ కమిటీ ఆధ్వర్యంలో ధారూరులోని జామ మసీదు నుంచి గంధం ఊరేగింపు నిర్వహించారు. అనంతరం దర్గాపై దట్టి కప్పి పూలమాలలు వేసి గంధం సమర్పించారు. ఈ కార్యక్రమంలో మత పెద్దలు ఇబ్రాహింసాబ్, డాక్టర్ ఎక్బాల్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి



గురుస్వాములకు విరాళం అందిస్తున్న వడ్డె ఆంజనేయులు దంపతులు

కుల్కచర్ల: ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని ఇప్పాయిపల్లి గ్రామానికి చెందిన వ్యాపారవేత్త వడ్డె ఆంజనేయులు పేర్కొన్నారు. బుధవారం కుల్కచర్ల మండల కేంద్రంలోని అయ్యప్పదేవాలయంలో ఆంజనేయులు దంపతులు స్వామికి ప్రత్యేకపూజలు నిర్వహించి దేవాలయ అభివృద్ధికి రూ. 50,051లు విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ సంస్కృతి, సంప్రదాయాలను, హిందూ ధర్మాన్ని కాపాడుకోవాలని సూచించారు. మండల అయ్యప్ప సేవా సమితి అధ్యక్షుడు పట్లోళ్ల వెంకట్రాంరెడ్డి, గురుస్వాములు ఈశ్వరయ్య, శివకుమార్, చందు, రాములు, వెంకటయ్య, నందు, కృష్ణయ్య, గొల్ల అంజి తదితరులు పాల్గొన్నారు.

చేవెళ్ల డివిజన్‌లో 90శాతం పూర్తి

- ముమ్మరంగా సమగ్ర కుటుంబ సర్వే
- ఇంటింటికి తిరిగి వివరాలు సేకరిస్తున్న ఎన్యుమరేటర్లు
- సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓలు, తహసీల్దార్లు



రామన్నగూడలో సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ విఠలేశ్వర్‌జీ

చేవెళ్ల: ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే చివరి దశకు చేరింది. చేవెళ్ల డివిజన్‌లో కొనసాగుతున్న సర్వే బుధవారం నాటికి 90శాతం పూర్తయినట్లు అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వం ముందుగా చెప్పిన షెడ్యూల్ ప్రకారం ఈనెల 18తోనే సర్వే పూర్తి కావాల్సి ఉంది. కానీ సర్వే ప్రారంభంలోనే ఉపాధ్యాయులను తీసుకొని శిక్షణలు ఇచ్చే కార్యక్రమంలో ఆలస్యం కావటంతో ఈ తేదీలో మార్పు జరిగింది. ఈ నెలాఖరు వరకు సర్వేతోపాటు డేటా ఎంట్రీ కూడా పూర్తి చేయాల్సి ఉంది. దీంతో ఇప్పటికే ఎన్యుమరేటర్లు ఇచ్చిన కుటుంబాల సంఖ్యను దాదాపు పూర్తిచేశారు. కొంతమంది పూర్తిచేయగా.. మరికొంత మంది చివరి దశలో ఉన్నారు. ఇక సర్వే వివరాలను ఆన్‌లైన్‌లో డేటా ఎంట్రీ చేయాల్సిన పని మాత్రం మిగిలింది. ఇప్పటికే మండల కేంద్రాల్లో డేటా ఎంట్రీలకు సంబంధించి కంప్యూటర్లు, ఆపరేటర్లను సిద్ధం చేసి ఉంచారు. అయితే ప్రభుత్వం వీరికి డేటా ఎంట్రీపై శిక్షణ ఇవ్వాల్సి ఉంది. మిగతా కార్యక్రమాలు దాదాపు పూర్తి చేశారు.

నాలుగు మండలాల్లో 90శాతం

చేవెళ్ల డివిజన్‌లోని చేవెళ్ల, శంకర్‌పల్లి, మొయినాబాద్, షాబాద్ మండలాలకు సంబంధించి ఇప్పటికే గుర్తించిన కుటుంబాల ప్రకారం సర్వే దాదాపు 90శాతం వరకు పూర్తి చేసినట్లు అధికారులు చెబుతున్నారు. పలు గ్రామాల్లో డోర్‌లాక్ చేసిన కుటుంబాలు, సర్వేకు వివరాలు చెప్పని కుటుంబాలు మినహా ఈ సర్వే దాదాపు ఒకటి, రెండు రోజుల్లో పూర్తవుతుందని వివరిస్తున్నారు. చేవెళ్ల డివిజన్‌లో స్టిక్కర్లు అతికించటం ద్వారా గుర్తించిన కుటుంబాల సంఖ్య 70,689లు ఉన్నాయి. ఇందులో చేవెళ్ల మండలంలో 17,023, శంకర్‌పల్లిలో మండలంలో 13,742, మున్సిపాలిటీలో 6,853, మొయినాబాద్‌లో 17,799, షాబాద్‌లో 15,272 కుటుంబాలు ఉన్నాయి. మంగళవారం నాటికి 58,948 కుటుంబాల సర్వే పూర్తి చేసినట్లు అధికారులు చెప్పారు.

రెండురోజుల్లో పూర్తవుతుంది



మండలంలో ఉన్న 146 బ్లాక్‌ల పరిధిలో 17,023 కుటుంబాలు ఉన్నాయి. ఈ సర్వేలో దాదాపు 90శాతానికిపైగా కుటుంబాల్లో సర్వే పూర్తయింది. ఇంకా 10శాతం వరకు చేయాల్సి ఉంది. అది కూడా రెండు రోజుల్లో పూర్తవుతుంది. డేటా ఎంట్రీకి సంబంధించి కూడా మండల కేంద్రంలోనే 32 కంప్యూటర్లు, 32 మంది ఆపరేటర్లను ఏర్పాటు చేసి సిద్ధంగా ఉన్నాం. గురువారం డేటా ఎంట్రీపై శిక్షణ ఇస్తున్నారు. సర్వే అనంతరం డేటా ఎంట్రీ పూర్తి చేస్తాం. సర్వేకు ప్రజలు సహకరిస్తున్నారు. కొన్నిచోట్ల డోర్ లాక్ ఉన్న కుటుంబాలకు ఫోన్‌లు చేస్తున్నాం. కొందరు స్పందించటం లేదు. వారు మినహా అన్ని కుటుంబాల సర్వే పూర్తవుతుంది.

–హిమబిందు, ఎంపీడీఓ